క్లుప్తంగా

అధిక మొత్తంలో శిస్తు చెల్లించాలనడం అన్యాయం

బూర్జ: మండలంలోని డొంకలపర్తలో భూమి శిస్తు డబ్బులు రూ.40,221 చెల్లించాలని రెవెన్యూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామానికి చెందిన బెజ్జిపురపు సత్యవతి వాపోతున్నారు. ఖాతా నంబర్ 123కి సంబంధించి మూడెకరాల రెండు సెంట్లకు 2022 నుంచి 2025 రూ.40,221 చెల్లించాలని అధికారులు నోటీసులు పంపించారని సత్యవతి బుధవారం తెలిపారు. 2021 వరకు శిస్తు మొత్తం చెల్లించానన్నారు. నాలుగేళ్లకు ఇంతమొత్తం శిస్తు చెల్లించాలని నోటీసులు జారీచేయడం అన్యాయమన్నారు. ఈమెతోపాటు పలువురు రైతులకు అధిక మొత్తంలో శిస్తు డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: ఈ నెల 30వ తేదీన నరసన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాపల్లి, గొట్టిపల్లి, కరగాం, కంబకాయ, దూకులపాడు, చల్లబంద, జిల్లోడుమాకివలస, జదూరు, యాట్లబసివలస, ఈదులవలస, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



ప్రత్యేకావసరాల చిన్నారిని గుర్తించిన అధికారులు

పొందూరు: ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే, బడిఈడు పిల్లల గుర్తింపును వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష ఐఈడీ జిల్లా కో ఆర్డినేటర్ బి.గోవిందరావు అన్నారు. బుధవారం పొందూరులో ప్రత్యేకావసరాల చిన్నారిని గుర్తించారు. ప్రత్యేకావసరాల చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు గూర్చి వివరించారు. అసిస్టెంట్ ఐఈడీ కోఆర్డినేటర్ వి.ఉమ, సీఎంఓ కె.రాంబాబు, ఎంఈఓ-2 పి.రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 120 దరఖాస్తులు

బూర్జ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు అర్హత గల 120 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు బుధవారం తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 86 మంది, జెడ్పీహెచ్‌ఎస్‌ల నుంచి 34 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి డీఈఓ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు.

సివిల్స్ విజేతకు అభినందన



వెంకటేశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, తదితరులు

జలుమూరు: సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన బాన్న వెంకటేశ్‌ను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు బుధవారం అల్లాడపేట వెళ్లి అభినందించారు. పేద ప్రజలకు సేవ చేయాలంటే దేశంలోనే అత్యున్నతమైన ఉద్యోగం కలెక్టర్ అని అన్నారు. విద్యార్థులు వెంకటేశ్‌ను ఆదర్శంగా తీసుకొని పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవ్, యూనియన్ నాయకులు ఇప్పిలి వేణుగోపాలరావు, పెరుమాల రాంబాబు, పాగోటి వాసుదేవరావు, పంచిరెడ్డి లక్ష్మీనారాయణ, జల్లు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌తో ప్రజలకు భద్రత



ఆటోకు క్యూ ఆర్ కోడ్ అతికిస్తున్న ఎస్‌ఐ ప్రవల్లిక

బూర్జ: ప్రజల భద్రతకు సురక్ష యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ఆటోలకు క్యూ ఆర్ కోడ్ జనరేట్ చేసి అతికించితున్నట్లు తెలిపారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు స్టిక్కర్లు అతికించడం జరుగుతుందన్నారు. ఇది ప్రజల భద్రత, ఆడపిల్లలు ఒంటరిగా ఆటోలో వెళ్లినప్పుడు వారి సమాచారం తెలుసుకోడానికి ఉపయోగపడుతుందన్నారు. దీనిని పక్కాగా అమలు చేయడానికి క్యూ ఆర్ కోడ్ జనరేట్ చేసి అతికించడం జరుగుతుందన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వద్దకు సేవలు ఎక్కడ?

- సకాలంలో అందని ఎరువులు, విత్తనాలు
- అందని పెట్టుబడిసాయం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



సత్యవరం ఆర్‌బీకేలో ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నియోజకవర్గం	ఆర్‌బీకేలు
నరసన్నపేట	91
ఆమదాలవలస	80
పాతపట్నం	91

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుకు పెట్టుబడి సహాయం ఇంతవరకు అందించలేదు. రైతులకు అవసరానికి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయడంలేదు. గడిచిన 11 నెలలుగా రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విత్తనాలు సరఫరా సక్రమంగా జరగలేదు. ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరికి పండిన ధాన్యం అమ్ముకోలేక అవస్థలు పడ్డారు. వ్యవసాయశాఖ మంత్రి ఉన్న పొరుగు నియోజకవర్గంలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన చోట్ల ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

రైతు ప్రభుత్వంగా భావించిన గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు ఎన్నో పథకాలు అమలు చేసింది. ఐదేళ్లు సమయానికి పెట్టుబడి సహాయం అందించింది. పంటల బీమా, వడ్డీ రాయితీ ఇలా పలు పథకాలు అమలు చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూసింది. రైతు చెంతకే ఎరువులు, విత్తనాలు చేర్చింది. నిత్యం రైతు భరోసా కేంద్రాలు రైతులతో కళకళలాడుతూ ఉండేవి. కియోస్కో యంత్రాలు సక్రమంగా పనిచేసేవి. రైతు విజ్ఞాన కేంద్రాలుగా ఆర్‌బీకేలు వర్ధిల్లాయి. ఇప్పుడు అంతా మారింది. రైతులపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం ఈ 11 నెలల్లో అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూ వచ్చింది. దీంతో ఇప్పుడు రైతు సేవా కేంద్రాల వైపు రైతులు చూడటం లేదు. కియోస్కో యంత్రాలు మూలకు చేరాయి. రైతు సేవా కేంద్రాలు కళావిహీనంగా మారాయి. రైతులతో పల్లెలు సంతోషంగా ఉండాల్సింది పోయి కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా కన్నీళ్లు పెడుతున్నాయి.



వెలవెల బోతున్న బొరిగివలస రైతు సేవా కేంద్రం

పెట్టుబడి రాయితీ అందలేదు



రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ కాలంలో అన్నీ సౌకర్యాలు రైతులకు అందేవి. సమయానికి పెట్టుబడి రాయితీ వచ్చేది. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆర్‌బీకేలు నిర్వీర్యమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి రాయితీ ఇవ్వకపోగా ఖరీఫ్, రబీల్లో పండిన ధాన్యం కొనలేక ఈ ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతుల కళ్లాల్లో ఇప్పటికీ ధాన్యం నిల్వలున్నాయి. ఈ ప్రభుత్వానికి రైతుల అవసరాలు పట్టడం లేదు.

– కింతలి చలపతిరావు, దాసరివానిపేట, నరసన్నపేట మండలం

నాడు కళకళ.. నేడు వెలవెల



పెద్దకొల్లివలసలో ప్రారంభంకాని గ్రామ సచివాలయ భవనం

ఏడాది పాలన ఇదేనా బాబూ..

- ప్రజలకు దూరమవుతున్న సచివాలయ సేవలు
- ఏడాది పాలనలో పురోగతిలేని దుస్థితి
- కూటమి ప్రభుత్వ పాలనలో మంగళం
- గత ప్రభుత్వం గుర్తులు చెరిపేందుకు యత్నం

నియోజకవర్గం	సచివాలయాలు
పాతపట్నం	91
ఆమదాలవలస	91
నరసన్నపేట	87

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పరిపాలన ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. పనుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సేవలు వారి ఊరిలోనే పొందేలా రూపకల్పన చేశారు. అందుకు తగ్గట్టుగా ఉద్యోగుల నియామకం, భవనాల నిర్మాణం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో సచివాలయ వ్యవస్థకు తిలోదకాలు ఇచ్చింది. సచివాలయాలు ఉంటే జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు గుర్తు చేసుకుంటారని భావించిన సీఎం చంద్రబాబు ఈ వ్యవస్థను అంచెలంచెలుగా రూపుమాపేలా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వలంటర్లను తొలగించారు. గ్రామ సచివాలయ పాలనను క్లస్టర్ విధానం అంటూ ఉద్యోగుల కుదింపు చర్యలు చేపట్టారు. సచివాలయానికి కాకుండా మండల, జిల్లా స్థాయి అధికారుల వద్దకు ప్రజలు వెళ్లేలా ఎప్పటికప్పుడు నిబంధనలు మార్చుతున్నారు. 2024 ఎన్నికల సమయానికి నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయ, తదితర భవనాలు ఏడాది అవుతున్నా కూటమి నాయకులు ప్రారంభించకుండా అలాగే వదిలేశారు.

సచివాలయ సేవలకు దూరం



గతంలో గ్రామ సచివాలయ సేవలు ఇంటి వద్దనే అందేవి. ప్రస్తుతం సచివాలయానికి వెళ్లి పనులు చెబితే ఇక్కడ కాదు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాలని పంపిస్తున్నారు. గతంలో అయితే వాలంటీర్లు ఇంటికి వచ్చి పనులు చేసేవారు. కుల, ఆదాయ, తదితర ధ్రువపత్రాలు ఇంటికే తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు పట్టించుకునే నాథుడే ఉండటం లేదు.

– పి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

సేవలు అందడం లేదు



గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా సచివాలయాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల్లో పది మందికి పైగా ఉద్యోగులను నియమించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. రూపాయి ఖర్చు లేకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజల పనులు జరిగేవి. కూటమి పాలనలో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు.

– బి మురళి, తంప, హిరమండలం

ఆ భూములు దళితులకే చెందాలి



సిమెంట్ దిమ్మలను తొలగిస్తున్న దళితులు, పేద ప్రజలు

బూర్జ: మండలంలోని అన్నంపేట పంచాయతీ జె.వి.ఆర్.పురంలో దళితులు సాగే చేస్తున్న 25 ఎకరాలు వారికే చెందాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరావు సింహాచలం బుధవారం డిమాండ్ చేశారు. దళితులు సాగు చేస్తున్న భూములను మంగపల్లి సూర్యప్రకాష్ చదును చేసి, సిమెంట్ స్తంభాలు కూడా వేశారన్నారు. దీనిపై ఇటీవల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేశామన్నారు. 1985లో కొంతమందికి డీ పట్టాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూముల్లో ఉన్న ఫెన్సింగ్, సిమెంట్ స్తంభాలు కూడా దళితులు, ఇతర కులాలకు చెందిన పేదలతో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో పొన్నాడ గౌరమ్మ, దంత శ్రీరాములు, దన్నాన లక్ష్మి, నేతల వెంకటమ్మ, సాకేటి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం గ్రామంలో నిర్మించిన ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట పూజలు బుధవారంతో ముగిశాయి. సోమవారం ప్రారంభమైన పూజలు బుధవారం విగ్రహ ప్రతిష్టతో ముగిశాయని గ్రామ పురోహితులు నేతేటి వెంకటరమణ మూర్తి, కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

పూడికల తొలగింపు

కొత్తూరు: మండలంలోని ఎన్ఎన్ కాలనీ మీదుగా వెళ్తున్న తామర చెరువు సాగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికలను నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. నీటిపారుదలశాఖ నుంచి రూ.5 లక్షలు మంజూరు కావడంతో ఈ పనులు చేసినట్లు ఏఈ ప్రసాదరావు తెలిపారు. పూడికలు తొలగించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

స్పందించారు.. పూడ్చారు..



గోతులు పూడ్చుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని నీలమణి దుర్గ లారీ, వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏబీ రోడ్డులో ఏర్పడిన భారీ గోతులను బుధవారం పూడ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డులోని ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద ఏర్పడిన గోతులను సుమారు రూ.30 వేలు ఖర్చు చేసి పూడ్చారు. అసోసియేషన్ సభ్యులకు వాహనదారులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



సరుబుజ్జిలి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రియదర్శిని



బూర్జ: అవగాహన కల్పిస్తున్న బూర్జ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

సరుబుజ్జిలి: రుతక్రమ సమయంలో కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహితీప్రియదర్శిని సూచించారు. ప్రపంచ రుతక్రమ పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదముందని వెల్లడించారు. సీహెచ్‌ఓ మోహనరావు, హెచ్.వి.లక్ష్మీభాయి, ఎంఎల్‌హెచ్‌పీ రుక్మిణి, ఆశ కార్యకర్తలు నిర్మల, పార్వతి పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: కిశోర్ బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన ఉండాలని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బూర్జ మార్కెట్ వీధిలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లభినాన సరోజిని, టి.తేజారావు, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

నాడు ఇంటి వద్దకే సేవలు..

నేడు నానా అగచాట్లు..!

- ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు
- అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను తొలగించిన వైనం

ఏడాది పాలన ఇదేనా బాబూ..



ఆమదాలవలసలోని 12వ వార్డులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఆమదాలవలస: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేరువగా.. అక్రమాలకు తావలేకుండా సంక్షేమ పథకాలు వారి ఇంటికి చేరవేసేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో వాలంటీర్లును నియమించారు. పింఛన్లు, విత్తనాలు, ఎరువులు అందజేయడం, తదితర అన్ని రంగాల్లో సంక్షేమ పథకాలను ఇంటవద్దకే చేరవేసి ప్రజలకు కష్టం కలగకుండా తన పరిధిలో ఉండే కుటుంబాలను సొంతవారిగా చూసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ వ్యవస్థను రద్దు చేయడంతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సంక్షేమ పథకాలు అందించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందనే చెప్పాలి. ఈ విషయాన్ని ప్రతి గ్రామంలోనూ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోసం ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు.

నియోజకవర్గం	వలంటీర్లు
ఆమదాలవలస	1,326
పాతపట్నం	1,535
నరసన్నపేట	1,354

వ్యవస్థ నిర్వీర్యం చేయడం తగదు



ప్రజలకు చేరువలో ఉంటూ వారికి స్వచ్ఛందంగా సేవలు అందించిన వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం ఈ ప్రభుత్వానికి తగదు. ప్రతి గ్రామంలోనూ వలంటీర్లు ప్రజల మన్ననలు పొందారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాసేవకే ఉంటాయి. అందులో భాగంగా వలంటీర్లు అందరం ప్రభుత్వ సేవలకులగా ఉన్నాం. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు మాయమాటలు చెప్పారు. వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పారు. మోసం చేయడం చంద్రబాబుకు కొత్త కాదు. వలంటీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకుంటే బాగుంటుంది.

– పైడి రాణాప్రతాప్, వలంటీర్, గోరింట, పొందూరు మండలం

నిస్వార్థంగా సేవలు అందించాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిస్వార్థంగా అందించాం. సకాలంలో పథకాలు చేర్చడం వలంటీర్లకు సాధ్యం. మమ్మల్ని తొలగించిన తరువాత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రతీ చిన్న విషయానికి కార్యాలయాల చుట్టూ పనులు మానుకొని తిరుగుతున్నారు. ప్రతి ఒక్కరూ వలంటీర్లు ఉంటే బాగుండేదని చర్చించుకుంటున్నారు. కరోనా వంటి కష్ట కాలంలో సేవలు అందించాం. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుంది. మళ్లీ మా సేవలు కొనసాగిస్తాం.

– ఎం.వెంకటరమణ, వలంటీర్, చిట్టివలస, ఆమదాలవలస మండలం

చెరువులు కాదు.. రోడ్లే



నరసన్నపేట: వంద పడకల ఆస్పత్రి ముందు బురద

- అధ్వానంగా రహదారులు
- చిన్న వర్షం పడితే బురదమయం
- కూటమి ఏడాది పాలనకు ఆనవాళ్లు..

అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లన్నీ బాగు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీలకు ఏడాది కావస్తోంది. పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పలు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు రోడ్లు బురదయంగా తయారయ్యాయి. వర్షాకాలం రాకముందే పరిస్థితి ఇలా ఉందంటే.. రానున్న రోజుల్లో ప్రయాణం ఎలా అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు బాగు చేయడం పక్కన పెడితే కనీసం గోతులు పూడ్చే పనులు కూడా చేయకపోవడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: వంద పడకల ఆస్పత్రికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతులు



కొత్తూరు: ఎస్సీ బాలుర వసతి గృహం ముందు ఏబీ రోడ్డులో చెరువులను తలపించే గోతులు



కొత్తూరు: నివగాం వద్ద పీహెచ్ రోడ్డులో ఏర్పడిన గోతులు



కొత్తూరు: త్రినాథస్వామి ఆలయం వద్ద పీహెచ్ రోడ్డులో చెరువును తలపించేలా ఉన్న గోతులు



ఆమదాలవలస: రైల్వే క్వార్టర్స్ పక్కనే గోతులమయమైన రహదారి



కొత్తూరు: కాలువను తలపించేలా ఉన్న సిరుసువాడ రోడ్డు



ఆమదాలవలస: పార్వతీశ్వరునిపేట వద్ద హిరమండలం-పాలకొండ రహదారి దుస్థితి



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్‌లో నిల్వ ఉన్న వర్షం నీరు